
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



శ్రీకాకుళం

జిల్లా వార్తలు

మంగళవారం 9 డిసెంబరు 2025

## తెచ్చారు.. వదిలేశారు

- రొట్టవలసలో అసంపూర్తి భవనంలోనే తరగతులు
- పెయింటింగ్, గ్రానైట్ పలకల ఏర్పాటు లేదు

7



## ప్రారంభానికి సిద్ధం.. నగర వనం

- కర్రలు, ఎండుగడ్డితో ఆకట్టుకునేలా నిర్మాణాలు
- అడవంతా వీక్షించేందుకు వీలుగా రహదారులు
- పలాస - కాశీబుగ్గలోని మెండు అటవీ ప్రాంతంలో పర్యాటకాభివృద్ధి

6



## అర్జీదారులు సంతృప్తి చెందాలి

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్
- 'మీ-కోసం' కార్యక్రమంలో 169 వినతుల స్వీకరణ

6



## మాదక ద్రవ్యాల నిర్మూలనే 'అభ్యుదయం' లక్ష్యం

- సైకిల్ యాత్రను విజయవంతం చేయండి
- ప్రజా ఫిర్యాదులు పూర్తిస్థాయిలో పరిష్కరించాలి
- ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి

6



## న్యూస్ బాక్స్

### ఎన్ఎస్ఎస్ అడ్వంచర్ క్యాంప్‌నకు బీఆర్ఏయూ విద్యార్థులు

ఎచ్చెర్ల, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ధర్మశాల(హిమాచల్‌ప్రదేశ్)లో ఈ నెల 12 నుంచి 21 వరకు నిర్వహించనున్న ఎన్ఎస్ఎస్ అడ్వంచర్ క్యాంప్-2025లో బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ తరఫున విద్యార్థులు పాల్గొంటున్నట్టు వర్సిటీ ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డి.వనజ తెలిపారు. 'అంబేద్కర్ యూనివర్సిటీకి చెందిన ఎంబీఏ విద్యార్థులు బూరవల్లి హర్షవర్ధన్, పావడ సాంబశివ, టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన డొంకాన యశ్వంత్(బీఎస్సీ), కోట తరుణ్‌రెడ్డి (బీకాం), సవర రామువేంద్ర రావు(బీఏ), రొక్కం భార్గవి (బీకాం), ఇసై మమత (బీఎస్సీ), కాశీబుగ్గ ఎస్‌బీఎస్‌వైఎం కళాశాలకు చెందిన పోతనపల్లి మానస(బీఎస్సీ), బెహరా త్రిష(బీఎస్సీ) ఈ క్యాంప్‌నకు హాజరు కానున్నారు. యూనివర్సిటీ ప్రతినిధిగా టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ పీవో వి.ల్యూక్‌పాల్ కంటింజెంట్ అధికారిగా వ్యవహరిస్తారు. వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని ప్రోత్సాహంతో, ఎస్‌వో డాక్టర్ కె.సామ్రాజ్యలక్ష్మి సారథ్యంలో విద్యార్థులు ఈ క్యాంప్‌లో పాల్గొనున్నారని కో-ఆర్డినేటర్ వనజ తెలిపారు.

### మిగులు సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లు

ఎచ్చెర్ల, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీలోని ఆర్ట్స్, సైన్స్ కళాశాలల్లో మిగిలిన సీట్ల భర్తీకి ఈ నెల 9 నుంచి 12 వరకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్టు వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.అడ్డయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'ఆర్ట్స్ కోర్సులకు సంబంధించి ఇంగ్లీషు, తెలుగు, జర్నలిజం, సోషల్‌వర్క్, ఎంఎల్ఐఎస్సీ, రూరల్ డెవలప్‌మెంటు, ఎకనామిక్స్ ఎంకాం, ఎంఈడీ కోర్సుల్లో జనరల్, ఈడబ్ల్యూఎస్ కేటగిరీల్లో 201 సీట్లు ఖాళీగా ఉన్నాయి. సైన్స్ కోర్సులకు సంబంధించి బయోటెక్నాలజీ, మైక్రో బయాలజీ, ఆర్గానిక్ కెమిస్ట్రీ, అనలెటిక్ కెమిస్ట్రీ, ఫిజిక్స్, మేథమెటిక్స్, అప్లైడ్ మేథమెటిక్స్ కోర్సుల్లో 56 సీట్లు ఖాళీ ఉన్నాయి. పీజీసెట్ రాసినవారు రూ.500, సెట్ రాయనివారు రూ.800 రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలి. ఎంఏ ఫిలాసఫీ, జియో ఫిజిక్స్, జియాలజీ కోర్సుల్లో జీరో అడ్మిషన్లు కావడంతో ప్రవేశాలు నిలిపివేశారు. ఆసక్తిగల విద్యార్థులు ధ్రువపత్రాలతో హాజరు కావాలి. స్పాట్ అడ్మిషన్‌లో సీటు పొందినవారికి ఎటువంటి ఉపకార వేతనాలు ఉండవని ప్రొఫెసర్ అడ్డయ్య తెలిపారు.




నిర్మాణ దశలో కొనసాగుతున్న కళింగపట్నం ఎత్తిపోతల పథకం

# అనుమతులు వెనక్కి!

## అటకెక్కిన ఎత్తిపోతల పథకాల మరమ్మతులు.. ఆపై కొత్త ప్రతిపాదనలు

- ఏడు పథకాలకు రూ.50 కోట్లు ఇవ్వడానికి మీనమేషాలు
- అనుమతులు ఇచ్చి మళ్లీ రద్దు చేసిన వైనం
- ఏడు వేల ఎకరాలకు సాగు నీరిస్తామన్న మాట బుట్టదాఖలు
- కాగితాలకే పరిమితమైన రైతుల సాగునీటి కలలు
- జిల్లా ప్రజాప్రతినిధులు స్పందించాలని వినతులు

శ్రీకాకుళం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సాగునీటి రంగం లక్ష్యం నీరుగారుతోంది. ఎత్తిపోతల పథకాలు నిధుల లేమి వెక్కిరిస్తుండగా.. కొత్త ప్రాజెక్టుల పేరుతో ప్రభుత్వం, అధికారులు కాగితాలపై లెక్కలు వేయడం విమర్శలకు తావిస్తోంది. రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఐడీసీ) తాజా నివేదికను పరిశీలిస్తే.. జిల్లాలో పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థమవుతోంది. ఇప్పటివరకు రూ.కోట్లు వెచ్చించి 41 ఎత్తిపోతల పథకాలను నిర్మించారు. వీటిద్వారా 37,255 ఎకరాలకు సాగునీరు అందించాలన్నది లక్ష్యం. కానీ ప్రస్తుతం ఈ పథకాల పరిస్థితి మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా మారింది. సివిల్, ఎలక్ట్రో-మెకానికల్ మరమ్మతులు లేక 34 పథకాలు పాక్షికంగా పని చేస్తున్నాయి. మిగిలిన ఏడు పథకాలు పూర్తిగా మూలనపడ్డాయి. ఈ పథకాలను పునరుద్ధరించి పూర్తిస్థాయిలో వినియోగంలోకి తేవాలంటే దాదాపు రూ.50.30కోట్లు అవసరమని అధికారులు నివేదికలో పేర్కొన్నారు. నిర్వహణ ఖర్చుల కోసం మరో రూ.97.79కోట్లు కావాలి. ఈ ప్రతిపాదనలు ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉండగా.. రైతులు మాత్రం సాగునీటి కోసం ఎదురుచూడాల్సిన దుస్థితి నెలకొంది.

● గతంలో మంజూరైన 7 ఎత్తిపోతల పథకాలకు రూ.55.62 కోట్లతో 6,997 ఎకరాలకు నీరిచ్చేలా అనుమతులు వచ్చినా.. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు వాటిని రద్దు చేయడం గమనార్హం. ఇప్పుడు మళ్లీ వాటికే పరిపాలనా అనుమతుల కోసం 'కొత్తగా' ప్రతిపాదనలు పంపడం అధికారుల కాలయాపనకూ.. ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలకు అద్దం పడుతోంది.

### నత్తనడకన నిర్మాణాలు

ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న పథకాల తీరు కూడా ఆశాజనకంగా లేదు. నత్తనడకన పనులు సాగుతున్నాయి. రూ.180 కోట్లతో చేపడుతున్న 'బొంతు- సారవకోట-కొత్తూరు' ఎత్తిపోతల పథకం వచ్చే జనవరి నాటికి పాక్షికంగా కూడా పూర్తయ్యే పరిస్థితి లేదు. 'తండ్యాం- కళింగపట్నం' పథకం పనులు పునఃప్రారంభించామని చెబుతున్నా.. పూర్తయ్యేందుకు ఇంకా ఏళ్లు పట్టేలా ఉంది.

● 730 ఎకరాలకు (మిగతా 6వ పేజీలో..)

# చోరీ చేసి.. ఇంటికి తాళం వేసి..

- సోంపేటలో 30 తులాల బంగారం అపహరణ
- రూ.లక్షకుపైగా నగదు కూడా..
- పోలీసులకు బాధితుల ఫిర్యాదు



ఆనవాళ్లు సేకరిస్తున్న క్లూస్‌టీమ్

సోంపేట, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): సోంపేటలోని కోర్టుపేట వీధిలో ఆదివారం రాత్రి భారీ చోరీ జరిగింది. పట్టణానికి చెందిన తంగుడు మనోజ్ ఇంట్లో 30 తులాల బంగారం, లక్ష రూపాయలకు పైగా నగదు అపహరణకు గురైంది. పోలీసులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తంగుడు మనోజ్ ఆదివారం ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి బరంపురంలో ఓ శుభ కార్యక్రమానికి వెళ్లారు. రాత్రి తిరిగొస్తుండగా ఇచ్ఛాపురం వద్ద వారి ద్విచక్ర వాహనం ప్రమాదానికి గురై మనోజ్ గాయపడ్డాడు. కొద్దిసేపటి తర్వాత ఇంటికి చేరుకున్నారు. అనంతరం మనోజ్ కాస్త అస్వస్థతకు గురయ్యారు. ఆయన భార్య ఆందోళన చెంది మనోజ్ స్నేహితుడికి ఫోన్ చేయగా ఆయన వచ్చి సపర్యలు చేశాడు. విషయం తెలిసి పక్కవీధిలోనే నివాసం ఉంటున్న మనోజ్ అన్న శ్రీను కూడా ఇంటికి వచ్చారు. తమ్ముడ్ని, పిల్లలు, మరదలు ఆందోళన చూసి రాత్రి 11 గంటల సమయంలో ఇంటికి (మిగతా 6వ పేజీలో..)

# ఒక వాట్సాప్ కాల్.. రూ.10 లక్షల టోకరా

## నకిలీ కరెన్సీ పేరిట వ్యాపారికి ఘరానా మోసం

పలాస, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): నకిలీ కరెన్సీని చెలామణి చేసి లాభాలు గడించవచ్చని అనుకున్న ఓ ఒడిశా వ్యాపారికి మోసగాళ్లు టోకరా ఇచ్చారు. ఈ ఘటన సోమవారం సాయంత్రం జాతీయరహదారి మొగిలిపాడు రోడ్డులో చోటుచేసుకుంది. ఒడిశాకు చెదిన ఓ వ్యాపారికి గుర్తుతెలియని వ్యక్తులు సోమవారం మధ్యాహ్నం వాట్సాప్ కాల్ చేసి రూ.10లక్షలు ఒరిజినల్ కరెన్సీ ఇస్తే రూ.50 లక్షల నకిలీ కరెన్సీ ఇస్తామని, అవి ఒరిజినల్‌గా చెలామణి చేసుకుని లాభాలు ఆర్జించవచ్చని చెప్పారు. దీన్ని ఇక ముందు కూడా కొనసాగిస్తామని నమ్మబలికారు. దీంతో సదరు వ్యాపారి సాయంత్రం మొగిలిపాడు జాతీయరహదారి వద్ద నగదు పట్టుకుని కారులో ఉండి వాట్సాప్ కాల్ చేసిన వారి కోసం కాపుకాచాడు. ఈ నేపథ్యంలో ఇద్దరు వ్యక్తులు ముఖానికి ముసుగు వేసుకుని స్కూటర్‌పై కారు వద్దకు వచ్చారు. బ్యాగులో రూ.50లక్షల నకిలీ కరెన్సీ ఉందని, బయటకు తీయవద్దని హెచ్చరిస్తూ అతని వద్ద ఉన్న ఒరిజినల్ కరెన్సీ రూ.10 లక్షల బ్యాగు పట్టుకుని వెళ్లిపోయారు. నకిలీ (మిగతా 6వ పేజీలో..)



ఏఎస్‌పేట (బోర్డర్)లో తాగునీటి కోసం మహిళల ఇక్కట్లు

# నీరివ్వరూ!

## ఇచ్ఛాపురంలో తాగునీటి కష్టాలు

- 1,2,3 వార్డుల్లో రెండు రోజులకోసారి ట్యాంకర్‌తో సరఫరా
- సమస్య పరిష్కరించాలని ప్రజల విజ్ఞప్తి

ఇచ్ఛాపురం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం మునిసిపాలిటీలో మౌలిక వసతులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా తాగునీటికి కటకటలాడుతున్నారు. 23 వార్డులు ఉన్న మునిసిపాలిటీలో 15 ఏళ్ల కిందట తాగునీటి పైపులైన్లు ఏర్పాటు చేశారు. అప్పట్లో 28 వేల మంది జనాభాకు తగ్గట్టుగా వీటిని వేశారు. ఇప్పుడు పట్టణంతోపాటు జనాభా కూడా పెరిగింది. 2011 జనాభా లెక్కల ప్రకారం 36వేల మంది జనాభా అని చెబుతున్నా.. ఆ సంఖ్య 50 వేలకుపైగా పెరిగినట్టు తెలుస్తోంది. కానీ జనాల అవసరాలకు తగ్గట్టుగా తాగునీటి సరఫరా లేదు. పట్టణ జనాభాకు రోజుకు సగటున 5.10 మిలియన్ లీటర్ల నీరు అవసరం. ప్రస్తుతం అందులో సగం నీరు మాత్రమే సరఫరా చేస్తున్నారు. మునిసిపాలిటీలోని 1, 2, 3 వార్డుల్లో ఏడాది పొడవునా తాగునీటి కష్టాలే. ఈ వార్డుల పరిధిలోని పురుషోత్తపురం, ఏఎస్‌పేటకు ఏర్పాటు చేసిన పైపులైన్లు లీకులయ్యాయి. పురుషోత్తపురం పుష్పగిరి కొండపై 5 లక్షల లీటర్ల నీటి సామర్థ్యం ఉన్న (మిగతా 6వ పేజీలో..)

# అక్రమాలు తేలుతాయ్!

- జలుమూరు, కొత్తూరు తహసీల్దార్ కార్యాలయాల్లో అవినీతిపై ఆరోపణలు
- విచారణకు అధికారుల నియామకం

శ్రీకాకుళం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): జలుమూరు, కొత్తూరు తహసీల్దార్ కార్యాలయాల్లో కొంతమంది అధికారుల అవినీతి ఆరోపణలపై విచారణకు రంగం సిద్ధమైంది. శాఖాపరమైన చర్యలకుగానూ విచారణాధికారిని నియమిస్తూ రెవెన్యూ (విజిలెన్స్-3) శాఖ సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. జలుమూరు తహసీల్దార్ బి.సత్యం, డిప్యూటీ తహసీల్దార్ పొన్నాడ శ్రీనివాసరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ బలివాడ సతీష్‌కుమార్ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారనే ఆరోపణలు ఉన్నాయి. ఏసీబీ డీజీ నుంచి వచ్చిన నివేదికల ఆధారంగా ప్రభుత్వం.. ఈ ఆరోపణలపై పూర్తిస్థాయి విచారణకు జేసీ ఫర్మాన్‌అహ్మద్‌ఖాన్‌ను విచారణాధికారిగా నియమించింది. మూడు నెలల్లోగా విచారణ పూర్తిచేసి నివేదిక అందజేయాలని స్పష్టం చేసింది.

● కొత్తూరులో తహసీల్దార్ పి.బాల, డిప్యూటీ తహసీల్దార్ కొప్పల బాలకృష్ణ, డిప్యూటీ సర్వేయర్ ఎం.శంకరరావు, జూనియర్ అసిస్టెంట్ పి లక్ష్మణ్‌కుమార్ (ప్రస్తుతం ఎంఆర్‌గా), డిప్యూటీ తహసీల్దార్ బి. సురేష్(సివిల్ సప్లయిస్), విలేజ్ రెవెన్యూ ఆఫీసర్ వి.రవికుమార్ (ప్రస్తుతం సీనియర్ అసిస్టెంట్), వివిధ పనుల కోసం లంచాలు వసూలు చేశారనే ఆరోపణలు ఉన్నాయి. దరఖాస్తుల ప్రక్రియ, రిజిస్టర్ల నిర్వహణలో అవకతవకలకు పాల్పడ్డారనే విమర్శలు ఉన్నాయి. వీటిపై పూర్తిస్థాయి విచారణకు జిల్లా రెవెన్యూ అధికారి(డీఆర్వో)ని విచారణాధికారిగా ప్రభుత్వం నియమించింది. నెలలో నివేదికను సమర్పించాలని ఆదేశించింది. ఏపీ సివిల్ సర్వీసెస్ రూల్స్-1991లోని నిబంధన 20 ప్రకారం ఈ చర్యలు తీసుకున్నట్టు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

# పాలసింగిలో కిడ్నీ వ్యాధి

## ఇప్పటివరకు ఇద్దరి మృతి.. చికిత్స పొందుతున్న మరో ఏడుగురు

● రోజురోజుకూ పెరుగుతున్న బాధితులు ● ఆందోళన చెందుతున్న గిరిజనులు

టెక్కలి రూరల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఆ ఊరిలో 18 కుటుంబాలు ఉన్నాయి. మొత్తం జనాభా 50మంది. అంతా నిరుపేద గిరిజనులే. వారిని గత ఐదేళ్ల నుంచి కిడ్నీవ్యాధి వేధిస్తోంది. ఇప్పటికే ఈ మహమ్మారి కారణంగా ఇద్దరు మృతి చెందారు. మరో ముగ్గురు డయాలసిస్ చేయించుకుంటున్నారు. ఇంకొక నలుగురు వరకు మందులు వాడుతున్నారు. ఇదీ టెక్కలి మండలం ముఖలింగపురం పంచాయతీలోని పాలసింగిలో దుస్థితి. ఈ గ్రామంలో పలువురు కిడ్నీ వ్యాధితో మంచం పట్టారు. కూలికి వెళ్తే కానీ కుటుంబ పోషణ జరగని తమని కిడ్నీ వ్యాధి చంపేస్తుందని గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. రెండేళ్ల కిందట గ్రామానికి చెందిన మల్లిపురం పార్వతి(జటలు) డయాలసిస్ జరుగుతుండగా మృతి చెందింది. గత ఏడాది జన్ని రత్నాలు అనే మహిళ అనారోగ్యానికి గురవడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షలు చేసి కిడ్నీ వ్యాధిగా నిర్ధారించారు. అప్పటికే మూడో స్టేజ్‌లోకి వెళ్లడంతో మృతి చెందింది. ప్రస్తుతం చిన్నింటి అప్పలస్వామి, జన్ని మోహనరావు, ఏ.సుభద్ర కిడ్నీవ్యాధితో బాధపడుతూ టెక్కలి జిల్లా ఆసుపత్రిలో డయాలసిస్ చేయించుకుంటున్నారు.



గతంలో ఈ బావి నీరు తాగేవారు

### తాగునీరే కారణమా?

గతంలో ఐటీడీఏ ద్వారా పాలసింగిలో రెండు తాగునీటి బావులను తవ్వారు. ఆ నీరు వినియోగించడం వల్లనే అధికంగా కిడ్నీ వ్యాధి ప్రబలినట్లు గ్రామస్థులు చెబుతున్నారు. రెండేళ్ల కిందట గ్రామానికి దూరంగా బోరును (మిగతా 6వ పేజీలో..)



పాలసింగిలో ప్రస్తుతం తాగుతున్నది ఈ ట్యాంకు నీరే

# ప్రారంభానికి సిద్ధం.. నగరవనం

- కర్రలు, ఎండుగడ్డితో ఆకట్టుకునేలా నిర్మాణాలు
- అడవంతా వీక్షించేందుకు వీలుగా రహదారులు

పలాస, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత పర్యాటకరంగ అభివృద్ధికి ఊతమిస్తోంది. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ సమీపంలో ఉన్న 800 ఎకరాల మెండు అటవీ ప్రాంతంలో నగరవనాన్ని అటవీశాఖ ఆధ్వర్యంలో అభివృద్ధి చేశారు. త్వరలో దీన్ని ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. అడవి చుట్టూ విహరించడానికి వీలుగా రహదారులను నిర్మించారు. మధ్యలో పర్యాటకులు సేదతీరడానికి కర్ర చెక్కలు, ఎండు గడ్డి, వెదురు కర్రలు, తాటి కర్రలతో నిర్మాణాలు చేపట్టారు. రెండు అంతస్థుల మేర ఉన్న ఈ కట్టడాలు కేరళ, ఊటీ అందాలను మరిపించేలా ఉంటాయి. నగరవనం ముఖద్వారం కూడా సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. కాఫీ, భోజన క్లబ్‌లు నిర్మించారు. మెండు అటవీప్రాంతంలో ఎక్కువగా జింకలు, నెమళ్లు, కుందేళ్లు ఉన్నాయి. వీటిని సంరక్షించడంతో పాటు ప్రజలు వీక్షించేందుకు వీలుగా వనాన్ని అందంగా తిర్చిదిద్దారు. చుట్టూ కంచె నిర్మాణం చేయడంతో పాటు కచ్చా రహదారి కూడా ఏర్పాటు చేశారు. నీడనిచ్చే మొక్కలతో పాటు పర్యావరణాన్ని పరిరక్షించే మొక్కలు కూడా నాటారు.


నగరవనం ప్రధాన ద్వారం


దట్టమైన మెండు అడవిలో పర్యావరణకు అనువైన కర్రలతో నిర్మాణం


అడవిలో విహరించేందుకు వీలుగా నిర్మించిన రహదారి


సౌత్‌జోన్ పోటీలకు వెళ్తున్న క్రీడాకారులతో వర్సిటీ వీసీ రజని తదితరులు

## సౌత్‌జోన్ పోటీలకు వర్సిటీ క్రీడాకారులు

ఎచ్చెర్ల, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ కాకినాడలో ఈనెల 10వ తేదీ నుంచి 14 వరకు జరగనున్న సౌత్‌జోన్ అంతర్ యూనివర్సిటీ వాలీబాల్ (పురుషులు) పోటీల్లో పాల్గొనేందుకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ తరఫున 16మంది క్రీడాకారులు సోమవారం బయలు దేరారు. ఈ సందర్భంగా సోమవారం వర్సిటీలో క్రీడాకారులను వీసీ, ప్రొఫెసర్ కేఆర్ రజని అభినందించారు. సౌత్‌జోన్ పోటీల్లో రాణించి వర్సిటీకి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.అడ్డయ్య, స్పోర్ట్స్ డీన్ పి.రవికుమార్, స్పోర్ట్స్ విభాగం కార్యదర్శులు ఎం.శ్రీనివాసరావు, ఎ.భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాల నిర్మూలనే ‘అభ్యుదయం’ లక్ష్యం

- సైకిల్ యాత్రను విజయవంతం చేయండి
- ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాల నిర్మూలన లక్ష్యంగా విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ‘అభ్యుదయం’ సైకిల్ యాత్రను జిల్లాలో విజయవంతం చేయాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆదేశించారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో సైకిల్ యాత్రపై కార్యాచరణ ప్రణాళికపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ సైకిల్ యాత్ర ఈనెల 15న జేఆర్ పురం నుంచి ప్రారంభమై వివిధ గ్రామాలు, పట్టణాల్లో అవగాహన కలిగిస్తూ 29న ఇచ్ఛాపురం మండలంలో ముగియ నుందన్నారు. వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొని విజయవంతం చేసేలా చర్యలు చేపట్టా లన్నారు. ‘డ్రగ్స్ ఫ్రీ ఏపీ-డ్రగ్స్ ఫ్రీ శ్రీకాకుళం’ నినాదంతో ముందుకు సాగాలని, డ్రగ్స్ నిర్మూలనలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని, ఈ దిశగా అవగాహన కలిగించాలన్నారు. గంజాయి నిర్మూలన పోలీసుల పనిమాత్రమే కాదని, ప్రతి పౌరుడి బాధ్యత అన్నారు. పోలీసు, ప్రజల భాగస్వామ్యం బలపడితే మాదక ద్రవ్యాల నిర్మూలన సాధ్యమన్నారు. డ్రగ్స్, గంజాయి రవాణా లేదా సరఫరా వంటి అక్రమ కార్యకలాపాలపై ఏమైనా సమాచారం ఉంటే టోల్ ఫ్రీ నెంబర్ 1972 లేదా సమీప పోలీస్‌స్టేషన్‌కు తెలియజేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీలు కేవీ రమణ, పి.శ్రీనివాసరావు, డీఎస్పీలు వివే కానంద, డి.లక్ష్మణరావు, సీఐలు, ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న పోలీసు అధికారులు

## అర్జీదారులు సంతృప్తి చెందాలి

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పాత శ్రీకాకుళం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను పరిశీలించి అర్జీదారులు సంతృప్తి చెందేలా సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. సోమవారం జడ్పీ సమావేశ మందిరంలో ప్రజా ఫిర్యాదులు నమోదు, పరిష్కార వేదికను నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన సుమారు 169 వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమస్యలను సకాలంలో పరిష్కరించి వారికి సమాచారమివ్వాలన్నారు.

### బాల్య వివాహాలు నివారిద్దాం

అనంతరం బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతీ ఒక్కరూ పాటుపడాలని, ఈదిశగా భాగస్వామ్యం అవుదామని అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. బాల్య వివాహాల వల్ల బాలికలు విద్య, ఆరోగ్య భద్రతకు ఆటంకాలు ఏర్పడతాయన్నారు. చట్టరీత్యా నేరమన్నారు. అనంతరం పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డిప్యూటి కలెక్టర్ పద్మావతి, డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్, ఇన్‌చార్జి జిల్లా రెవెన్యూ అధికారి లక్ష్మణమూర్తి, పలాస ఎయిర్ పోర్ట్ ప్రత్యేక అధికారి ఎం.వెంకటేశ్వరరావు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.


అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

## ప్రజా ఫిర్యాదులు పూర్తిస్థాయిలో పరిష్కరించాలి

శ్రీకాకుళం క్రైం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను పరిశీలించి పూర్తిస్థాయిలో పరిష్కరించాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కార వేదికను నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన 62 వినతులను స్వీకరించారు. ఫిర్యాదుదారులతో స్వయంగా మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించవద్దన్నారు.


బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

## నీరివ్వరూ!

(ఐదో పేజీ తరువాయి)

ట్యాంకర్‌ను నిర్మించి వృథాగా వదిలేశారు. అది శిథిలావస్థకు చేరింది. దీంతో ఈ మూడు వార్డుల్లో ట్యాంకర్ల ద్వారా అరకొరగా నీటిని అందిస్తున్నారు. రత్తకన్న పరిధిలో చాలా వీధులకు రెండు రోజులకోసారి నీటి సరఫరా జరుగుతోంది. పలు ప్రాంతాల్లో భూ మట్టానికి మూడు నుంచి ఐదు అడుగుల గోతులో ఉన్న కుళాయి నుంచి నీటిని పట్టుకుంటున్నారు. ప్రస్తుతం పట్టణంలో 15 బోర్లు పనిచేయడం లేదని అధికారికవర్గాలు చెబుతున్నాయి. కానీ, అంతకు మించి బోర్లు మూలకు చేరాయని తెలుస్తోంది.

### ఉద్దానం.. అధ్వానం

ఉద్దానం సమగ్ర మంచినీటి పథకంలో ఇచ్ఛాపురం మునిసిపాలిటీకి చోటిచ్చారు. కానీ..ఇంతవరకూ నీటిని అందించలేదు. రూ.54.48 కోట్ల కేంద్ర నిధులతో పైలెట్ ప్రాజెక్టు నిర్మాణ దశలో ఉంది. అది పూర్తయితే కానీ.. పట్టణంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దొరికే అవకాశం లేదు. ఉద్దానం ప్రాజెక్టులో భాగంగా బాహుదా నదిలో ఊటబావులు ఏర్పాటు చేశారు. వాటి ద్వారా నీటిని పంపింగ్ చేస్తున్నారు. క్లోరినేషన్ చేపట్టిన తరువాత రాజావారితోటలో రిజర్వాయర్ ద్వారా పట్టణ అవసరాల కోసం 8లక్షల లీటర్ల నీటిని ప్రతిరోజూ విడిచిపెడుతున్నారు. ఈ నీరు ప్రజల అవసరాలకు చాలడం లేదు. బాహుదాలో పుష్కలంగా నీరు ఉన్నా అధికారులు రెండు రోజులకోసారి కుళాయిల ద్వారా తాగునీటిని అందిస్తున్నారని పట్టణ వాసులు ఆవేదన చెందుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

### చర్యలు తీసుకుంటున్నాం

1, 2, 3 వార్డులు పురుషోత్తపురం, ఏఎస్‌పేటల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. సుడా అధికారులతో కూడా మాట్లాడాం. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పీల గోవింద్ వద్ద కూడా ప్రతిపాదనలు పెట్టాం. వీలైనంత త్వరలో పనులు ప్రారంభిస్తాం.

**- బెందాళం అశోక్, ఎమ్మెల్యే, ఇచ్ఛాపురం**

### సమస్య పరిష్కరించాలి

ఇచ్ఛాపురంలో తాగునీటి సమస్య దశాబ్దాలుగా ఉంది. ఎప్పుడో దశాబ్ద కాలం కిందట వేసిన పైపులైన్లు, కుళాయిలు పాడయ్యాయి. ఎప్పుడు నీటి సరఫరా ఉంటుందో? ఎప్పుడు ఉండదో తెలియని పరిస్థితి. ఇప్పటికైనా ప్రభుత్వం దృష్టి పెట్టాలి. తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి.

**- కాళ్ల నరసింహమూర్తి, ఇచ్ఛాపురం**

### ట్యాంకర్ల ద్వారా సరఫరా

మునిసిపాలిటీలో తాగునీటి ఎద్దడి నిజమే. ప్రజలకు ఇబ్బందులు లేకుండా ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నాం. త్వరలో ఉద్దానం సమగ్ర మంచి నీటి పథకంతో పాటు కేంద్ర నిధులతో చేపడుతున్న ప్రాజెక్టు అందుబాటులోకి రానుంది. అంతవరకూ ఇబ్బందులు తప్పవు.

**- ఎన్.రమేష్, కమిషనర్, ఇచ్ఛాపురం మునిసిపాలిటీ**

### మౌలిక వసతులు లేవు

మునిసిపాలిటీలో మౌలిక వసతులు లేవు. దీంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారమార్గం చూపించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయి. ఇప్పటికైనా పాలకులు దృష్టి సారించాలి.

**- కొరికాన యోగి, ఇచ్ఛాపురం**

## అనుమతులు వెనక్కి!

(ఐదో పేజీ తరువాయి)

నీరివ్వాల్సిన మజ్జిగూడెం(హిరమండలం) ఎత్తిపోతల పథకం పనులు ఇంతవరకు ప్రారంభమే కాలేదు. కాంట్రాక్టరు పనులు చేయకపోవడంతో కాంట్రాక్ట్ రద్దు చేసి మళ్లీ టెండర్లు పిలవాల్సిన పరిస్థితి నెలకొంది. కాంట్రాక్టర్ పనులు ప్రారంభించకపోయినా ఇన్నాళ్లు అధికారులు ఏమి చేశారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

### కాగితాల్లో నవశకం..

పాత ఎత్తిపోతల పథకాలు బాగుచేయడానికే నిధులు లేవు కానీ.. కొత్తవాటికి మాత్రం కొదవలేదు. వంశధార, నాగావళి, మహేంద్రతనయ నదుల ఆధారంగా మడపాం, అంబాలవలస, కొసమాల, సీది, లోలుగు తదితర ప్రాంతాల్లో కొత్త ఎత్తిపోతల పథకాలకు (సుమారు 20 వేల ఎకరాలకు పైగా ఆయకట్టు) సవరించిన అంచనాలు పంపామని నివేదిక చెబుతోంది. ఆలస్యమైనా ‘బొంతు-సారవకోట, తండ్యాం-కళింగపట్నం’ వంటి పథకాలను 2025-26 నాటికి పూర్తి చేస్తామని లక్ష్యంగా పెట్టుకోవడం కాస్త ఊరటనిచ్చే అంశం. సీది, లోలుగు వంటి కొత్త ప్రాంతాల్లో 9,977 ఎకరాలకు సాగునీరు అందించేలా ప్రతిపాదనలు సిద్ధం చేయడం ఆహ్వానించదగ్గ పరిణామం. ఇవి కార్యరూపం దాల్చితే ఆయా మండలాల స్వరూపం మారుతుంది.

### ఇలా చేస్తే మేలు..

కొత్త ప్రాజెక్టులకు శంకుస్థాపనల మోజులో పడి.. ఉన్న 41 ఎత్తిపోతల పథకాలను గాలికి వదిలేయకుండా బాగుచేయాలి. తక్షణమే మరమ్మతులకు రూ.50కోట్లు విడుదల చేసి వాటిని పూర్తిస్థాయిలో అందుబాటులోకి తేవాలి. రద్దు నిర్ణయాలు, మళ్లీ ప్రతిపాదనలతో సమయం, అంచనా వ్యయం రెండూ పెరుగుతాయి. ఇది ప్రజాధనాన్ని వృథా చేయడమే. కేవలం ప్రభుత్వానికి అంచనాలు పంపి, చేతులు దులుపుకొంటే సరిపోదు. ఆమోదం పొందేలా ఒత్తిడి తెచ్చి, నిధులు సాధించినప్పుడే రైతులకు న్యాయం జరుగుతుంది. దీనిపై ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.


శిలాఫలకంతో నిలిచిపోయిన తండ్యాం ఎత్తిపోతల పథకం పనులు

## పాలసింగిలో కిడ్నీ వ్యాధి

(ఐదో పేజీ తరువాయి)

తవ్వారు. అది ఎన్ని రోజులూ పనిచేయలేదు. దీంతో మళ్లీ గ్రామ సమీపంలో మరో బోరును తవ్వారు. ప్రస్తుతం ఈ నీటినే గ్రామస్థులు తాగుతున్నారు. అయినా ఇటీవల గ్రామానికి చెందిన జన్ని మోహనరావు అనే యువకుడు కిడ్నీ వ్యాధి బారినపడడంతో గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. నీరు కలుషితం కావడంతోనే ఈ పరిస్థితి ఏర్పడిందని వారు చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత కొండల నుంచి వచ్చే వరద నీరు బావుల్లోకి వెళ్లకుండా చర్యలు చేపట్టింది. దీనికోసం కాలువతో పాటు రోడ్డును నిర్మించింది. అయినా వ్యాధిగ్రస్థులు తగ్గకపోవడంతో గిరిజనులు ఆందోళనకు గురవుతున్నారు.

### ఆదుకున్న కూటమి ప్రభుత్వం

పాలసింగిలోని డయాలసిస్ రోగులను గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. మూడేళ్ల నుంచి వారు డయాలసిస్ చేయించుకుంటున్నా పింఛన్ ఇవ్వకపోవడంతో వైద్య ఖర్చులకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొంతమందిలో వ్యాధి లక్షణాలు బయటపడుతున్నా వైద్యానికి డబ్బులు లేక చికిత్స పొందలేకపోతున్నారు. వ్యాధి తీవ్రత పెరిగిన తరువాత ఆసుపత్రికి వెళ్తుండడంతో ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంది. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే వారి సమస్యను స్థానిక టీడీపీ నాయకుడు గుజ్జు సత్యనారాయణ.. వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో కిడ్నీ బాధి తులకు నెలకు రూ.10వేలు చొప్పున పింఛన్ మంజూరైంది. అలాగే ప్రభుత్వం స్పందించి కిడ్నీవ్యాధి నివారణకు చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు. గ్రామంలో వైద్యశిబిరం నిర్వహించి రక్తపరీక్షలు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

### పెళ్లయిన రెండు నెలలకే..



నాకు వివాహం జరిగిన రెండు నెలలకే కిడ్నీ వ్యాధి తీవ్రత ఎక్కువైంది. దీంతో వారానికి మూడుసార్లు డయాలసిస్ చేయించుకుంటున్నా. చిన్నవయసులో వ్యాధి ప్రబలడంతో చాలా బాధగా ఉంది. గత మూడు నెలల నుంచి రూ.10వేలు పింఛన్ వస్తోంది.

**- జన్ని మోహనరావు, కిడ్నీ బాధితుడు, పాలసింగి**

### డయాలసిస్ చేయించుకుంటున్నా..



రెండేళ్ల కిందట నాకు కిడ్నీ వ్యాధి సోకింది. వారానికి రెండు సార్లు డయాలసిస్ చేయించుకుంటున్నా. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాతే నాకు రూ.10వేలు పింఛన్ వస్తోంది. గ్రామంలో కిడ్నీ వ్యాధి ప్రబలడానికి కారణమేంటో తెలుసుకుని నివారణకు అధికారులు చర్యలు చేపట్టాలి.

**- అనుపురం సుభద్ర, కిడ్నీ బాధితురాలు, పాలసింగి**

### శాశ్వత పరిష్కారం చూపాలి



మా గ్రామంలో రోజురోజుకూ కిడ్నీ వ్యాధిగ్రస్తులు పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. గ్రామంలో తక్కువ కుటుంబాలే ఉన్నా ఎక్కువ మందిలో కిడ్నీ వ్యాధి లక్షణాలు బయటపడుతున్నాయి. దీనికి శాశ్వత పరిష్కారం చూపాలి. సురక్షితమైన తాగు నీరు ఇస్తే మంచిది.

**- చిన్నింటి అప్పలస్వామి, కిడ్నీ బాధితుడు, పాలసింగి**

## జాతీయస్థాయి స్విమ్మింగ్ పోటీలకు జిల్లా క్రీడాకారులు

శ్రీకాకుళం స్పోర్ట్స్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి స్విమ్మింగ్ పోటీలకు జిల్లాకు చెందిన ఇద్దరు క్రీడాకారిణులు ఎంపికయ్యారు. ఈనెల 3న నరసరావుపేటలో జరిగిన 69వ రాష్ట్రస్థాయి అండర్-17 బాలికల ఎస్‌జీఎఫ్ స్విమ్మింగ్ పోటీల్లో కేంద్రీయ విద్యాలయం విద్యార్థిని దీక్ష బెహరా 100 మీట ర్లు, 50 మీటర్ల ఫ్రీ స్టైల్‌లో రెండు బంగారు, పి.ఇషా సంహిత 800 మీటర్ల స్వి మ్మింగ్‌లో కాంస్య పతకం సాధించారు. వీరిద్దరూ ఈనెల 11 నుంచి 15వ తేదీ వరకు ఢిల్లీలో జరగనున్న జాతీయ స్థాయి స్కూల్‌గేమ్స్ స్విమ్మింగ్ పోటీల్లో పా ల్గొంటారు. ఈ సందర్భంగా మంగళవారం డీఈవో ఎ.రవిబాబు, జిల్లా ఒలింపిక్ సంఘం కార్యదర్శి ఎం.సాంబమూర్తి, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శులు బీవీ రమణ, స్వాతి తదితరులు అభినందించారు.


విద్యార్థినులను అభినందిస్తున్న డీఈవో రవిబాబు

### స్విమ్మింగ్ పోటీలో ప్రతిభ

బూర్జ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ అండర్-19 విభాగం పోటీలో పీఎల్ దేవిపేట గ్రామానికి చెందిన చింతాడ వరలక్ష్మి ప్రతిభ కనబరిచారు. ఈనెల 8 నుంచి 10వ తేదీ వరకు విశాఖ పట్నం జీవీఎంసీ ఆక్వా స్పోర్ట్స్ స్విమ్మింగ్ పూల్‌లో 400 మీటర్ల పోటీల్లో ద్వితీయ స్థానం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ పోటీలు న్యూఢిల్లీ జీఎస్ జీటీలో ఈనెల 12 నుంచి 17వ తేదీ వరకు స్విమ్మింగ్ పోటీల్లో పాల్గొంటుందని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈమె పాలకొండలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఈ సందర్భంగా వరలక్ష్మిని గ్రామస్థులు, కళాశాల ప్రతినిధులు అభినందించారు.


చింతాడ వరలక్ష్మి

## చోరీ చేసి.. ఇంటికి తాళం వేసి..

(ఐదో పేజీ తరువాయి)

తాళం వేసి వారందరినీ తన ఇంటికి తీసుకెళ్లిపోయారు. సోమవారం ఉదయం పిల్లలను పాఠశాలలకు సిద్ధం చేసే క్రమంలో మనోజ్ దంపతులు తమ ఇంటికి చేరుకోగా గేటుకు తాము వేసినది కాకుండా మరో తాళం వేసి ఉండడంతో అవాక్కయ్యారు. ఆ తాళాన్ని పగులగొట్టి ఇంట్లోకి వెళ్లి చూడగా ఎక్కడి వస్తువులు అక్కడే ఉన్నాయి. బీరువా తాళాలు కూడా తాము భద్రపరిచిన స్థానంలోనే ఉన్నాయి. కానీ బీరువా తెరిచి చూడగా తాము దాచుకున్న బంగారం 30తులాల బంగారు ఆభరణాలు, రూ.లక్షకుపైగా నగదు కనిపించలేదు. దీంతో వారు ఆందోళన చెంది పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ లవరాజు, ఎస్ఐ మంగరాజుతోపాటు శ్రీకాకుళం నుంచి క్లూస్‌టీమ్ వచ్చి ఇల్లుతోపాటు పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఇదిలా ఉండగా తెలిసినవారే ఈ చోరీకి పాల్పడి ఉంటారని స్థానికులు చర్చించుకుంటున్నారు. బీరువాలో దుస్తులు, వెండి వస్తువులు భద్రంగా ఉండగా, బంగారం ఆభరణాలు, నగదు మాత్రం చోరీకి గురవడం అనుమానాలకు తావిస్తోందని పేర్కొంటున్నారు. బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ లవరాజు తెలిపారు.

### దొంగతనాల జోరు

సోంపేట పట్టణంలో ఇటీవల వరుసగా దొంగతనాలు జరుగుతుండడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. దొంగలు తాళం వేసిన ఇళ్లనే టార్గెట్ చేసుకుని చోరీలకు పాల్పడుతున్నారు. ఇటీవల చీకటిబంగ్లా వీధిలో కూడా తాళం వేసిన ఇంట్లో చోరీకి యత్నించారు. పోలీసులు స్పందించి నిఘా పెంచాలని, చోరీలకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

## ఒక వాట్సాప్ కాల్.. రూ.10 లక్షల టోకరా

(ఐదో పేజీ తరువాయి)

కరెన్సీ ఎలా ఉంటుంది? అంత మొత్తంలో ఉందా? లేదా? అన్న సందేహాలతో సదు వ్యాపారి బ్యాగును తెరిచి చూడగా అందులో నగదుకు బదులు పుస్తకాలు, కాగితాలు ఉన్నాయి. దీంతో లక్ష్మయ్య కంగుతిన్నాడు. ద్విచక్రవాహనంపై వచ్చిన వారి కోసం వెతికినా ఫలితం లేకపోయింది. దీంతో తాను మోసపోయానని గుర్తించి లబోదిబోమన్నాడు. నకిలీ కరెన్సీతో ఇతరులకు మోసం చేద్దామనుకున్న లక్ష్మయ్య తానే మోసపోయానని గుర్తించాడు. ఒక్క వాట్సాప్ కాల్‌కు రూ.పది లక్షలు మూల్యం చెల్లించుకున్నానని విచారం వ్యక్తం చేశాడు. ఈ వ్యవహారంపై బాధితుడు ఫిర్యాదు చేయలేదు.

## క్రీడలతో ఉజ్వల భవిష్యత్

● ఎమ్మెల్యే కూన రవికుమార్

ఆమదాలవలస, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ సాధ్యమని ఎమ్మెల్యే రవికుమార్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో 69వ అంతర పాఠశాల గ్రిగ్స్ క్రీడా పోటీలను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తి, ఆరోగ్యవంతమైన జీవనశైలి, సమగ్రమైన వ్యక్తిత్వ వికాశానికి క్రీడలు దోహదం చేస్తాయన్నారు.గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి ప్రోత్సహించే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ తమ్మినేని గీతావిద్యాసాగర్, టీడీపీ రాష్ట్ర నాయకులు మొదలవలస రమేష్, తమ్మినేని చంద్రశేఖర్, బోర గోవిందరావు, నాయకులు సనపల డిల్లీశ్వరరావు, ఎస్.మురళీధర్, నాగళ్ల మురళీధర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

## క్రీడల్లో ప్రావీణ్యానికి ప్రభుత్వ చర్యలు

● ఎమ్మెల్యే బెందాళం అశోక్

ఇచ్ఛాపురం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచి క్రీడల్లో ప్రావీణ్యం పొందేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, వీటిని సద్వినియోగం చేసుకోవా లని ప్రభుత్వ విప్, ఎమ్మె ల్యే బెందాళం అశోక్ అన్నారు. సురంగి రాజా మైదానంలో సోమవారం 76వ నియోజకవర్గస్థాయి అంతర్ పాఠశాలల క్రీడా పోటీలను ప్రారంభించారు. క్రీడా జ్యోతిని వెలిగించారు. క్రీడా జెండాలను ఎగురవేశారు. క్రీడల్లో విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించేలా ప్రత్యేక శిక్షణ ఇవ్వాలన్నారు. సురంగి రాజా క్రీడా మైదానం అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. ఇచ్ఛాపురం, కవిటి, కంచిలి, సోంపేట మండలాల నుంచి 750 మంది విద్యార్థులు ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ కొండా శంకర్ రెడ్డి, జనసేన ఇన్‌చార్జి దాసరి రాజు, డిప్యూటీ డీఈవో విలియమ్స్, తహసీల్దార్ ఎన్.వెంకటరావు, ఎంపీడీవో ప్రభాకరరావు, ఎంఈవోలు కె.అప్పారావు, ఎస్.విశ్వనాథం, ఏఎంసీ చైర్మన్ మణిచంద్రప్రకాష్, పలువురు టీడీపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.



క్రీడా జ్యోతిని వెలిగిస్తున్న ఎమ్మెల్యే అశోక్

## విద్యార్థులకు ఉదయం పోషకాహారం

● ఎమ్మెల్యే గొండు శంకర్

శ్రీకాకుళం రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే విద్యార్థులకు ఉద యపు పోషకాహారం అందించడం అభినందనీయమని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. సోమవారం కిష్టప్పపేట జడ్పీ హైస్కూల్‌లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చాలా మంది పిల్లలు ఉదయం అల్పాహారం తినకుండా పాఠశాలకు వస్తున్నారని, దీంతో వారి కోసం అక్షయ పాత్ర పౌష్టికాహారం అందించడం శుభపరిణామమన్నారు. అనంతరం విద్యార్థులకు పోషకాహారం, చిరుధాన్యాలతో చేసిన చిక్కీలు, వేరుశనగ, ప్రొటీన్ బార్‌లను పంపిణీ చేశారు. ఈ పోషకాహారం శ్రీకాకుళం, గార మండలాల్లో సుమారు 14 వేల మంది విద్యార్థులకు మేలు జరుగుతుందన్నారు. మంగళ, గురు, శనివారాల్లో ఉదయాన్నే పోషకాహారం అందించేం దుకు నిర్ణయించారని, ఫలితాలు అనుకూలంగా వస్తే వచ్చే ఏడాది నుంచి ఆరు రోజులు అందించేలా చర్యలు తీసు కుంటామన్నారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన పథకం అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాసరావు, ఎంఈవోలు నక్క రామ కృష్ణ, మురళీకృష్ణ, హెచ్‌ఎం సాయి సంధ్య, సర్పంచ్ సత్య వతి, అక్షయపాత్ర రీజనల్ మేనేజర్ రామమోహన్ తదితరులు పాల్గొన్నారు.



పిల్లలకు పోషకాహారాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్

## రాష్ట్రంలో ప్రజారంజక పాలన

● ఎమ్మెల్యేలు శంకర్, రవికుమార్

ఆమదాలవలస, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ప్రజా రంజక పాలన సాగుతోందని ఎమ్మెల్యేలు కూన రవికుమార్, గొండు శంకర్ అన్నారు. సోమవారం మునిసిపాలిటీ పరిధి చింతాడ మన్నయ్యపేట, నందిగిరిపేట, తిమ్మాపురం, కుద్దిరాం ప్రాంతాల్లో మురుగునీటి శుద్ధి కేంద్రాల నిర్మాణానికి ఒకటో వార్డు తిమ్మాపురంలో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వైసీపీ పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడి, అన్ని ప్రాంతాలు అధ్వాన స్థితికి చేరుకున్నాయని విమర్శించారు. కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో రాష్ట్రంలో అభివృద్ధి ముందుకు సాగుతోందన్నారు.

మురుగు నీటితో ప్రజలు ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా ఈ సమస్య పరిష్కారానికి రూ.1.66 కోట్లతో మురుగునీటి శుద్ధి కేంద్రాలను నిర్మిస్తున్నామన్నారు. మురుగునీటిని శుద్ధి చేసి చెరువుల్లో నిల్వ చేసేలా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ తమ్మినేని గీతా విద్యా సాగర్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఎస్.మురళీధర్, పట్టణ మహిళా అధ్యక్షురాలు బోయిన సునీత, మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్లు బోర గోవిందరావు, కూన వెంకట రాజ్యలక్ష్మి జనసేన కన్వీనర్ పేరాడ రామ్మోహన్, పలువురు టీడీపీ నేతలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## న్యూస్ బాక్స్

### న్యాయవాద ఓటర్ల జాబితా విడుదల

శ్రీకాకుళం లీగల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న రాష్ట్ర బార్ కౌన్సిల్ ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితాను సోమవారం బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తంగి శివప్రసాద్, పిట్టా దామోదర్, విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ న్యాయ వాదుల అభ్యంతరాలు, సవరణలు ఉంటే ఈనెల 17 లోగా రాష్ట్ర బార్ అసోషియేషన్ దృష్టికి తీసుకు వెళ్లాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు కొమ్ము రమణ మూర్తి, భవానీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### ఎరువుల దుకాణాల తనిఖీ

సోంపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎరువుల దుకాణాలను పలాస వ్యవసాయశాఖ ఏడీ ఎం.రామారావు ఆధ్వర్యంలో వ్యవసాయాధికారులు సోమవారం తనిఖీ చేపట్టారు. స్టాకు రిజిస్టర్, స్టాకును పరిశీలించారు. ఎరువుల కొనుగోలు, అమ్మకం, నిల్వ రికార్డుల నిర్వహణ, గరిష్ఠ అమ్మకం ధర దుకాణం వద్ద ప్రదర్శించాలని, లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏవో బి.నరసింహమూర్తి, పలువురు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

కవిటి/కంచిలి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో లబ్ధిపొందాలని ఎమ్మెల్యే బి.అశోక్ అన్నారు. రామయ్యపుట్టుగలో సోమవారం పలువురు బాధితులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మణిచంద్రప్రకాష్, రైల్వేబోర్డు సభ్యుడు శ్రీనివాస రౌళో, కాళింగ కార్పొరేషన్ డైరెక్టర్ బి.చిన్నబాబు,ఎం.ప్రదీప్, పోలయ్య తదితరులు పాల్గొన్నారు.

### ఖోఖో సంఘం రాష్ట్ర ట్రెజరర్‌గా శ్రీనివాసరావు

శ్రీకాకుళం స్పోర్ట్స్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఖోఖో అసోసియేషన్ రాష్ట్ర ట్రెజరర్‌గా శ్రీకూర్మం జడ్పీ ఉన్నత పాఠశాల వ్యాయామోపాధ్యాయుడు సాధు శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. ఏలూరులో జరిగిన ఎన్నికల్లో ఈ యనను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావును జిల్లా కబడ్డీ సంఘం చైర్మన్, ఎమ్మెల్యే గొండు శంకర్, సంఘం అధ్యక్షుడు చిట్టి నాగభూషణం, కార్యదర్శి ఫల్గుణరావు, జిల్లా ఒలింపిక్ సంఘం చైర్మన్ ధర్మాన కృష్ణదాస్, గౌరవ సలహాదారు పి.సుందరరావు, కార్యదర్శి ఎం.సాంబ మూర్తి, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులు అభినందించారు.



### బాల్య వివాహాల వల్ల అనర్థాలు

టెక్కలి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కలిగించాలని తహసీల్దార్ బి.సత్యం తెలిపారు. సోమవారం బాల్య వివాహం ముక్త్ భారత్‌లో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాల్యవివాహాల నిర్మూలన చట్టం- 2006 పై ప్రజలకు వివరించాలన్నారు. బాల్య వివాహాలు చేసుకునే బాలికల ఆరోగ్యం దెబ్బతింటుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రేణుక, వైద్యాధికారి భాగ్యశ్రీ, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

## సర్వే నెంబరును సరిచేయండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న బీసీ సంఘం నేతలు

సోంపేట రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జలంతర పొత్తంగి గ్రామానికి చెందిన 443 సర్వే నెంబరును మందస మండలంలో 442 సర్వే నెంబరుగా చూపిస్తూ ధ్రువపత్రాలు జారీ చేస్తున్నారని దీంతో సమస్యలు ఎదురవుతున్నాయని, తగు చర్యలు తీసుకోవాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ అప్పలస్వామికి వినతిపత్రం అందించారు. సర్వే నెంబరు వల్ల గ్రామంలో సుమారు 280 కుటుంబాలు పలు రకాల ధ్రువపత్రాలు పొందేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. తగు చర్యలు తీసుకుని ప్రజలకు న్యాయం చేయాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో బీసీ సంక్షేమ సంఘ ప్రతినిధులు ఎస్. గుణప్రసాద్, నరసింహులు యాదవ్, గోవిందరాజులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ తెలిపారు.

## ఘనంగా ముప్పిడి సురేష్ జన్మదినం



సురేష్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న కూటమి నాయకులు

లావేరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): లావేరు మండల టీడీపీ అధ్యక్షుడు ముప్పిడి సురేష్ 50వ పుట్టినరోజును సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కేక్ కట్ చేసి పంచి పెట్టారు. ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పల నాయుడు, టీడీపీ జోనల్ కోఆర్డినేటర్లు సురేష్‌కు ఫోన్‌లో జన్మదిన శుభా కాంక్షలు తెలిపారు. ఎచ్చెర్ల ఏఎంసీ మాజీ చైర్మన్ ఇనపకుర్తి తోట య్యదొర, మాజీ ఎంపీపీ మీసాల వెంకటరమణ, జడ్పీటీసీమాజీ సభ్యులు పిన్నింటి మధుబాబు, ఆర్.ప్రకాశరావు శాలువలు, బోకేలతో సత్కరించి అభినందించారు. రోగులకు స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. అనాథా శ్రమాల్లో అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో బుడతవలస ఎంపీటీసీ ముల్లు సాయి, టీడీపీ నాయకులు గొర్లె శ్రీనివాసరావు, ముప్పిడి మురళీ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## భూముల పరిశీలన



భూముల రికార్డులను పరిశీలిస్తున్న రెవెన్యూ, అటవీ శాఖాధికారులు

ఎచ్చెర్ల, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): కొయ్యాం రెవెన్యూ గ్రామ పరిధి లో అటవీ భూములు ఆక్రమణకు గురయ్యాయని ఇచ్చిన ఫిర్యాదులపై హైకోర్టు ఆదేశాల మేరకు రెవెన్యూ, అటవీశాఖాధికారులు సోమవారం సదరు భూములను పరిశీలించారు. ఈ మేరకు హైకోర్టు ఆదేశాల మేరకు భూములను సర్వే చేస్తున్నట్లు తహసీల్దార్ బి.గోపాల్, ఫారెస్ట్ రేంజర్ రాజశేఖర్ తెలిపారు. గ్రామా నికి చెందిన కొంతమంది సుమారు 62 ఎకరాలను ఆక్రమించి కొబ్బరి సాగు చేస్తున్నట్టు ఫిర్యాదు చేశార న్నారు. దీనిపై వాస్తవాలు తెలుసుకునేందుకు క్షేత్రస్థాయిలో పరిశీలించా మని, నివేదికను ఉన్నతాధికారులకు, హైకోర్టుకు అందజేస్తామన్నారు.

## భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు



మాట్లాడుతున్న మాజీ మంత్రి గౌతు శివాజీ

సోంపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న ముక్కోటి ఏకాదశికి సంబంధించి భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి గౌతు శివాజీ అన్నారు. కోదండ రామస్వామి ఆలయంలో సోమవారం ఆలయ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున వారికి అసౌకర్యం కలుగకుండా కృషి చేయాలన్నారు. సమావేశంలో ఈవో రామారావు, టీడీపీ నాయకులు మద్దు కుమార్, బీన ఆనంద్, చిత్రాడ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## రాయితీపై రుణాలివ్వాలి

రణస్థలం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రజక యువతకు రాయితీపై రుణాలు మంజూరు చేయాలని రాష్ట్ర రజక కార్పొరేషన్ డైరెక్టర్ గురు జాపు రాము కోరారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో బీసీ కార్పొరేషన్ డైరెక్టర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా రజక కులస్థులు వెనకబడి ఉన్నారని, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ అవకాశాలు కల్పించాలన్నారు. 50 ఏళ్లు దాటిన రజకులకు సామాజిక పింఛన్ మంజూరు చేయాలన్నారు. రజక యువతకు ఆధునిక యంత్రాలపై దోబీ శిక్షణ ఇప్పించాలని, రజకులకు ఎస్సీ రిజర్వేషన్ కల్పించాలని కోరారు.

## విమానాల రద్దుతో గందరగోళం: తమ్మినేని

ఆమదాలవలస, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఇండిగో విమానాల రద్దుతో గంగరగోళ పరిస్థితులు నెలకొన్నాయని మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం ఆవేదన వ్యక్తంచేశారు. సోమవారం తన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ.. ఇది యాదృచ్ఛిక సమస్య కాదని, పూర్తిగా నిర్వాహక వైఫల్యమని ఆరోపించారు. పౌర విమానయాన శాఖపై మంత్రి రామ్మోహన్ నాయుడుకు పట్టులేదని తేలిపోయిందన్నారు. కొన్ని రోజులుగా రోజుకు వెయ్యికి పైగా విమానాలు రద్దు కావడంతో వేలాది ప్రయాణికులు ఎయిర్‌పోర్టుల్లో చిక్కుకు పోయి ఇబ్బందులు పడుతున్నారన్నారు.

## ధర్మం పాటించడమే సర్వమత సారం

ఆమదాలవలస, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ధర్మం పాటించడమేనని సర్వమతాల సారమని రాష్ట్ర పీయూసీ చైర్మన్, ఎమ్మెల్యే కూన రవి కుమార్ అన్నారు. సోమవారం పాత ఆమదాలవలస చర్చిలో పాస్టర్ రాడ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో మేరీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేక్ కట్ చేశారు. నియోజకవర్గంలో ఏ మతం వారికి ఎటువంటి అవసరం ఉన్నా ప్రభుత్వ నిబంధనల మేరకు సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో 40 మంది సంఘ సేవకులు, పలువురు క్రైస్తవులు పాల్గొన్నారు.

## కేంద్రమంత్రి రామ్మోహన్‌పై విమర్శలు తగవు

● ఎమ్మెల్యే గొండు శంకర్

శ్రీకాకుళం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): దేశాభివృద్ధికి కృషి చేస్తున్న కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడిపై విమర్శలు తగవని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఇండిగో సంస్థ తప్పుడు ప్రణాళిక వల్ల నాలుగైదు రోజులుగా ప్రయాణీకులు ఇబ్బంది పడ్డారన్నారు. శ్రీకాకుళం బిడ్డ కేంద్రమంత్రిగా దేశానికి సేవలు అందిస్తున్న రామ్మోహన్ నాయుడిపై వైసీపీ చేస్తున్న అసత్య ప్రచారాలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. పొగ మంచు సమయంలో కూడా పూర్తి విజిబులిటీతో విమానాన్ని ల్యాండ్ చేసే విధానాన్ని తీసుకువచ్చిన కేంద్రమంత్రిపై విమర్శలు చేయడం సరికాదన్నారు.



వినతులపై అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొండు శంకర్

### ప్రజాదర్బార్‌లో వినతుల స్వీకరణ

శ్రీకాకుళం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని ఎమ్మెల్యే తన క్యాంపు కార్యాలయంలో సోమ వారం ఎమ్మెల్యే గొండు శంకర్ ప్రజాదర్బార్ నిర్వహించారు. అర్జీదారులతో మాట్లాడుతూ సామాన్యులకు అండగా కూటమి ప్రభుత్వం ఉందన్నారు. సమస్యల పరిష్కారం కోసం వచ్చిన ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. కొన్ని వినతులపై సకాలంలో స్పందించి అధికారులతో మాట్లాడి సూచనలిచ్చారు.

## పవన్‌కల్యాణ్ చొరవతో పంచాయతీరాజ్ అభివృద్ధి

● జనసేన ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు చంద్రమోహన్

శ్రీకాకుళం అర్బన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చొరవతో రాష్ట్రంలో పంచాయతీరాజ్‌శాఖ అభివృద్ధి చెందుతోందని జనసేన ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు పిసిని చంద్రమోహన్ అన్నారు నగరంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం నేతలు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ బాధ్యతలను చూస్తూ ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న ఉద్యోగులకు పదోన్నతులు కల్పించారన్నారు. స్థానిక సంస్థలు స్వతంత్రంగా పనిచేసేలా నూతన సంస్కరణ అమలు చేశారన్నారు. పంచాయతీలను బలోపేతం చేయడంతో పాటు మండల, డివిజన్ స్థాయిల్లో అధికారులను నియమించి పరిపాలన అందించేలా కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు భాస్కరరావు, కూర్మారావు, అవినాష్, సురేష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పిసిని చంద్రమోహన్

## ఘనంగా సంతోషిమాత ఆలయ వార్షికోత్సవం

ఇచ్ఛాపురం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): బెల్లుపడ కాలనీ లోని సంతోషిమాత ఆలయ 32వ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు ఆలయ అర్చకులు వరప్రసాద్, భానుమతి ఆధ్వర్యంలో వేకువజామునుంచే అమ్మవారికి పంచామృతాభి షేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్ట ణంతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

## వివాదాలను పరిష్కరించుకోండి



మాట్లాడుతున్న న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు

శ్రీకాకుళం లీగల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం కార్పొరేషన్‌కు సంబంధించి ఏవైనా వివాదాలుంటే వాటిని న్యాయసేవాధికార సంస్థ ద్వారా పరిష్కరించుకోవచ్చని జిల్లాన్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు కార్పొరేషన్ అధికారులను తెలిపారు. ఈమేరకు సోమవారం సంస్థ కార్యాలయంలో కార్పొరేషన్ అధికారులతో సమావేశం నిర్వహించి చర్చించారు. కార్యక్ర మంలో కార్పొరేషన్ లీగల్ కోఆర్డినేటర్ జగదీష్, న్యాయవాదులు చిన్నాల జయరాం, గేదల వాసుదేవరావు తదిత రులు పాల్గొన్నారు

## తెచ్చారు.. వదిలేశారు

● పెయింటింగ్, గ్రానైట్ పలకల ఏర్పాటు లేదు
● అసంపూర్తి భవనంలోనే తరగతులు
● ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

సరుబుజ్జిలి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రొట్టవలస జడ్పీ ఉన్నత పాఠశాల అదనపు భవనాల నిర్మాణంతో పాటు విద్యుత్, పెయింటింగ్ పనులు చేపట్టాల్సి ఉంది. నాడు-నేడు రెండు విడతల్లో రూ.1.07 కోట్లు మంజూరు కాగా భవన నిర్మాణం పూర్తిచేశారు. అయితే పెయింటింగ్, విద్యుత్ సదుపాయం తదితర పనులను అప్పటి ప్రభుత్వం వివిధ కాంట్రాక్టర్లకు అప్పగించింది. అయితే ఆ పనులు పూర్తి కాకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. భవన నిర్మాణాన్ని పూర్తి చేసిన వ్యక్తులు విద్యుత్ ఫర్నిచర్, పెయింటింగ్, గ్రానైట్ ఫ్లోరింగ్ తదితర పనులు చేయలేదు. అయితే 2024 ఎన్నికలకు ముందు భవనాన్ని ప్రారంభించేందుకు గాను తెల్లరంగు వేశారు. ఆ తరువాత అప్పటి స్పీకర్ తమ్మినేని సీతారాం 2024 మార్చి 11న ఆ భవనాన్ని ప్రారంభించారు. అయితే పెయింటింగ్ నిమిత్తం 50 రంగు డబ్బాలను తీసుకువచ్చారు. అయితే నేటికీ ఆ రంగులు గోడలకు పడలేదు. దీంతో అవి నిరుపయోగంగా పడి ఉన్నాయి. రంగులు గడ్డకట్టి పాడవుతున్నాయని, దీంతో ప్రభుత్వ ధనం వృథా అయిందన్న విమర్శలొస్తున్నాయి. భవనం పూర్తయినా వాటిలో ఎటువంటి సదుపాయాలు కల్పించకపోవడంతో ఇబ్బందుల మధ్య తరగతులను నిర్వహించాల్సిన పరిస్థితి ఎదురవు తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఫర్నిచర్, పెయింటింగ్, విద్యుత్, గ్రానైట్ పలకల ఏర్పాటు తదితర పనులు పూర్తి చేయాలని పలువురు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.



గదిలో మూలన ఉన్న పెయింట్ డబ్బాలు



రంగులు లేక అసంపూర్తిగా ఉన్న భవనం

క్రైం కార్నర్

# అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి


సాయి (ఫైల్)

కోటబొమ్మాళి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తాటిపర్తి పంచాయతీ గోపాలపురం గ్రామానికి చెందిన మన్యాల సాయి (24) నరసన్నపేట మండలం చోడవరం గ్రామ సమీపంలో వంశధార కాలువలో పడి అనుమానాస్పదంగా మృతిచెందాడు. గ్రామస్థులు తెలిపిన సమాచారం మేరకు మృతుడు సాయి గొర్రెల వ్యాపారం చేస్తుంటాడు. అందులో భాగంగా చోడవరం గ్రామానికి చెందిన గొర్రెల వ్యాపారుల నుంచి డబ్బులు రావాల్సి ఉందని చెప్పి ఆదివారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లాడు. రాత్రి ఇంటికి చేరకపోవడం.. ఫోన్ పని చేయకపోవడంతో తల్లిదండ్రులు మన్యాల అప్పన్న, సావిత్రమ్మలతో పాటు బంధువులు ఆందోళనకు గురయ్యారు. సోమవారం ఉదయం చోడవరం గ్రామ సమీపంలోని వంశధార కలువలో తన ద్విచక్ర వాహనంతో పడి మృతి చెందాడని సమాచారం రావడంలో వారు గ్రామస్థులు, బంధువులతో కలిసి సంఘటన స్థలానికి చేరుకున్నారు. పోలీసుల సమక్షంలో మృతదేహాన్ని బయటకు తీశారు. తల్లిదండ్రులు గొర్రెలు కాసుకొని జీవనం సాగిస్తున్నారు. చేతికి అందిన కుమారుడు మృతి చెందడంతో కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతుడుకి తల్లిదండ్రులతో పాటు తమ్ముడు చరణ్ ఉన్నాడు. సాయి మృతితో గ్రామంలో విషాదచాయలు అలముకున్నాయి. నరసన్నపేట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## పురుగుల మందు తాగి విద్యార్థిని..


కీర్తి (ఫైల్)

రణస్థలం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ముక్తుంపురం గ్రామానికి చెందిన శీల కీర్తి (16) పురుగుల మందు తాగి మృతి చెందింది. జేఆర్‌పురం ఎస్ఐ ఎస్.చిరంజీవి తెలిపిన వివరాల మేరకు టీవీ ఎందుకు ఎక్కువగా చూస్తున్నావని తల్లి మందలించిందనే బాధతో ఈ నెల 6న వ్యవసాయం కోసం ఇంట్లో ఉంచిన మందును కీర్తి తాగింది. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను చికిత్స నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. కీర్తి స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మీడియట్ మొదటి సంవత్సరం చదువుతోంది. తండ్రి శీల పైడితల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు జేఆర్‌పురం ఎస్ఐ చిరంజీవి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## కొట్లాటలో ఒకరికి గాయాలు

కోటబొమ్మాళి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కోటబొమ్మాళి హడ్కో కాలనీకి చెందిన ఇద్దరు వ్యక్తుల మధ్య తలెత్తిన వివాదం కొట్లాటకు దారి తీసింది. పోలీసుల కథనం మేరకు స్థానిక ఎన్టీఆర్, ఎర్రన్నాయుడు పార్కు వద్ద సోమవారం మధ్యాహ్నం ఆ ఇద్దరు కొట్లాటకు దిగారు. ఈ సంఘటనలో స్థానిక పంచాయతీ కార్యాలయంలో పారిశుధ్య కార్మికుడిగా పని చేస్తున్న వ్యక్తి తలకు తీవ్రగాయమైంది. అతని కుటుంబ సభ్యులు సంఘటన స్థలానికి చేరుకొని చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించినట్లు వైద్యులు తెలిపారు. ఈ మేరకు స్థానిక ఎస్ఐ వి.సత్యనారాయణ ఆసుపత్రికి చేరుకొని ఘర్షణకు గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. కేసు దర్యాప్తులో ఉందని ఎస్ఐ తెలిపారు.

## మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి జరిమానా

పలాస, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపిన వాహనదారులకు పలాస మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు సోమవారం భారీ జరిమానాలు విధించింది. మొత్తం 16 మంది మద్యం తాగి... కాశీబుగ్గ పోలీసులకు పట్టుబడగా వారిని కోర్టులో హాజరుపరిచారు. ఒకొక్కరికి రూ.10వేల చొప్పున మొత్తం రూ.1.60 లక్షల అపరాధ రుసుం విధించారు. దీంతో పాటుగా బహరంగంగా మద్యం తాగి పట్టుబడిన మొత్తం 12 మందికి ఒక్కొక్కరికి రూ.వెయ్యి చొప్పున అపరాధ రుసుం విధించినట్లు కాశీబుగ్గ ఎస్ఐ నర్సింహమూర్తి విలేకరులకు తెలిపారు.

**టెక్కలిలో...**

టెక్కలి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో నిందితులకు రూ.పదివేల చొప్పున జరిమానా విధిస్తూ టెక్కలి జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ యు.మాధురి సోమవారం తీర్పు చెప్పారని సీఐ వి.విజయ్‌కుమార్ తెలిపారు. ఈ కేసుల్లో అన్నెపు బాబూరావు, జామి శ్యామసుందరరావు, బంగారు లక్ష్మీనారాయణ, బెండి సోమేశ్వరరావు, కొర్లాన రాము, సానుపల్లి బాబూరావు, నీలాపు సురేష్, దుంప ఉపేంద్రలకు జరిమానా విధించారని ఆయన తెలిపారు. టెక్కలి పోలీస్ స్టేషన్ పరిధిలో నిత్యం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్నామని, వీటిలో పట్టుబడితే శిక్ష తప్పదని సీఐ విజయ్‌కుమార్ తెలిపారు.

## వాహనం డిక్కీలోని నగదు చోరీ

పలాస, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వాహనంలో డిక్కీలో పెట్టిన రూ.1.20 లక్షల నగదు మాయమైనట్లు బాధితుడు కాశీబుగ్గ పోలీసులకు ఫిర్యాదు సోమవారం ఫిర్యాదు చేశాడు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు... కాశీబుగ్గకు చెందిన రమేష్ మహరణ అనే వ్యక్తి స్థానికంగా ఉన్న ఇండియన్ బ్యాంకులో సోమవారం మధ్యాహ్నం బంగారు ఆభరణాల కొదువ పెట్టి రూ.1.20 లక్షలు రుణం తీసుకొని తన ద్విచక్ర వాహనం డిక్కీలో పెట్టాడు. అనంతరం కేకును కొనేందుకు వాహనాన్ని రోడ్డుపై పార్కింగ్ చేసి షాపులోకి వెళ్లాడు. తిరిగి వచ్చి చూసే సరికి డిక్కీ తెరిచి ఉంది. అందులో ఉన్న నగదు పోయినట్లు బాధితుడు లబోదిబో మన్నాడు. బ్యాంకు నుంచి డబ్బులు విత్‌డ్రా చేసిన నుంచి ఆయనను గుర్తు తెలియని వ్యక్తులు అనుసరించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ మేరకు బ్యాంకు, రోడ్డుపై ఉన్న పోలీసు, ప్రైవేటు సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వై.రామకృష్ణ తెలిపారు.

## కొట్లాట కేసులో ఇద్దరి అరెస్టు

పాతపట్నం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక పెట్రోల్ బంక్ వద్ద సెప్టెంబరు 18న జరిగిన కొట్లాట ఘటనలో పొట్నూరు భవానీ శంకర్‌ను అరెస్ట్‌చేసి సోమవారం కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్ఐ కె.మధుసూదనరావు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు శ్రీకాకుళానికి చెందిన తమ్మినేని సాయికుమార్, పొట్నూరు భవానీశంకర్ అలియాస్ బబ్లు అనే ఇద్దరు వ్యక్తులు సెప్టెంబరు 18న పర్లాకిమిడి వచ్చి మార్గమధ్యలో పాతపట్నం పెట్రోల్ బంక్ వద్ద తగాదా పడ్డారు. ఈ తగాదాలో సాయికుమార్ తలపై రాయితో బబ్లు బలంగా కొట్టి గాయపరిచాడు. దీంతో ఆయన పాతపట్నం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈఘటనలో నిందితుడు అప్పటి నుంచి తప్పించుకొని తిరుగుతుండగా సోమవారం అరెస్ట్ చేసి స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్ఐ తెలిపారు.

**గాయపరిచిన కేసులో...**

పాతపట్నం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మామిడిపల్లి గ్రామంలో పడాల రాజు అనే వ్యక్తికి కత్తితో గాయపరిచిన నిందితుడు జన్ని రామారావును సోమవారం అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. సోదపంచాయతీ కొమ్మలగూడ గ్రామానికి చెందిన జన్ని రామారావు అలియాస్ పాసి రాజారావు అక్టోబరు 26న మామిడిపల్లి వద్ద జరిగిన ఓ ఫంక్షన్‌కు హాజరయ్యేందుకు వెళ్లాడు. అక్కడ అదే గ్రామానికి చెందిన జన్ని రామారావు వివాదం తలెత్తింది. ఇది కొట్లాటకు దారి తీసింది. ఈ సంఘటనలో గాయపడిన బాధితుడు పడాల రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కె.మధుసూదనరావు తెలిపారు. అప్పటి నుంచి తప్పించుకు తిరుగుతున్న జన్ని రామారావును అరెస్ట్‌చేసి సోమవారం కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్ఐ తెలిపారు.

# పీఏసీఎస్ ఉద్యోగుల డిమాండ్లు పరిష్కరించండి


నిరసన తెలుపుతున్న పీఏసీఎస్ ఉద్యోగులు

కోటబొమ్మాళి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ సహకార సంఘ ఉద్యోగుల న్యాయమైన కోర్కెలను తక్షణమే పరిష్కరించాలని కోటబొమ్మాళి, సంతబొమ్మాళి సహకార సంఘ సీఈవోలు మెండ సత్యం, ఇచ్ఛాపురం మాధురి డిమాండ్ చేశారు. సోమవారం వీరు పీఏసీఎస్ ఉద్యోగులతో కలిసి స్థానిక డీసీసీబీ ఎదుట ధర్నా నిర్వహించారు. జీవోనెంబర్ 36ను వెంటనే అమలు పరిచి మధ్యంతర భృతి ఇవ్వాలని కోరారు. గ్రాట్యుటీని చెల్లించాలని, తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. రిటైర్మెంట్ వయస్సు 62 సంవత్సరాలుగా నిర్ణయించాలని... ఉద్యోగులకు రూ. 5 లక్షలకు తక్కువ కాకుండా ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

## ధాన్యం కొనుగోలు చేయాలని..


రైతులతో మాట్లాడుతున్న బుచ్చిబాబు

హిరమండలం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కొండరాగోలు రెవెన్యూ పరిధిలో సుమరు 170 ఎకరాల వరి పంట ఈ క్రాప్‌లో నమోదు కాలేదన్న కారణంతో 2000 ధాన్యం బస్తాలు ప్రభుత్వం కొనుగోలు చేయడం లేదు. రైతు సేవా కేంద్రాలు, అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోవడంతో తమకు న్యాయం జరిగేలా చూడాలని జెడ్పీటీసీ బుచ్చిబాబును సోమవారం రైతులు కోరారు. ఈ మేరకు ఆయన కొండరాగోలు గ్రామనికి వెళ్లారు. రైతుల వద్ద నిల్వ ఉన్న ధాన్యం బస్తాలను పరిశీలించారు. రెవెన్యూ పరిధిలో సకాలంలోనే ఈ క్రాప్ నమోదు చేసినట్లు రైతు సేవా కేంద్రంలో అగ్రికల్చరల్ అసిస్టెంట్ చెప్పారని రైతులు ఆయనకు తెలిపారు. తీరా ధాన్యం కొనుగోలు సమయానికి వారి భూములు ఈ క్రాప్‌లో నమోదు చేయలేదని చెప్పడం సమంజసం కాదన్నారు. సమస్య తెలుసుకున్న జెడ్పీటీసీ సభ్యుడు బుచ్చిబాబు వెంటనే బాధిత రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయాలని మండల వ్యవసాయ అధికారులకు సూచించారు. రైతులకు ఇబ్బంది పెడుతూ ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకు రావద్దన్నారు.

## ఐక్యపోరాటంతో పలాస జిల్లాను సాధించుకుందాం

పలాస, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఐక్యపోరాటాల ద్వారా పలాస జిల్లాను సాధించుకుందామని, జిల్లా ఆవశ్యకతపై ఇంటింట ప్రచారాలు నిర్వహించడానికి సమాయత్తం కావాలని వక్తలు పిలుపునిచ్చారు. సోమవారం సాయంత్రం స్థానిక ఎస్ఎఫ్ఎస్ స్కూల్ రోడ్డులో పలాస జిల్లా సాధన కమిటీ రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు దువ్వాడ శ్రీధర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వక్తలు మాట్లాడుతూ జిల్లాగా పలాస ఏర్పడితే అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతుందని, ఇచ్ఛాపురం, పాతపట్నం, కవిటి, సోంపేట వంటి మండలాల ప్రజలకు ఈ ప్రాంతం ఎంతో అనువుగా ఉంటుందని ఉదహరించారు. ప్రభుత్వ పెద్దలు పునరాలోచించి పలాసను జిల్లాగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పలాస జిల్లా సాధన కమిటీ కన్వీనరుగా దువ్వాడ శ్రీధర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో చాపర సుందరలాల్, కె.రవికుమార్, కుమార్ నాయక్, ఎం.వినోద్‌కుమార్, పాలవలస వైకుంఠరావు, తంగుడు వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

## భోజనంలో నాణ్యత లోపిస్తే ఏజెన్సీల తొలగింపు


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో చంద్రమౌళి

ఎల్.ఎన్.పేట, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపిస్తే సంబంధిత వంట ఏజెన్సీలను తొలగి స్తామని ఎంఈవో-2 కె.చంద్రమౌళి తెలిపారు. లక్ష్మీనర్సుపేట గ్రామంలోగల మోడల్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం విద్యార్థులకు వండి పెడుతున్న మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యంగా ఉండేందుకు పోషక విలువలతో కూడిన భోజనాన్ని అందించాలన్నారు. నిత్యం సంబంధిత పాఠశాలల హెచ్‌ఎంలు మధ్యాహ్న భోజనాన్ని పరి శీలించాలని ఆదేశించారు. ఆయనతో పాటు సీఆర్‌పీ అచ్యుతరావు, హెచ్‌ఎం బి.రమాదేవి, ఉపాధ్యాయులు మన్మథ కుమార్ మిశ్రో, ఎన్.రామారావు, పి.లక్ష్మణరావు, టి. ఉపేంద్ర పాల్గొన్నారు.

## పారిశుధ్య సమస్యను పరిష్కరించండి


బాబూరావుకు సమస్యను వివరిస్తున్న మహిళలు

పలాస, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): వార్డుల్లో మురుగు కాలువలు నిర్మించి పారిశుధ్య సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక పలాస, పురుషోత్తపురం వార్డు ప్రజలు ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావును కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన ప్రభుత్వ ఆసుపత్రి రోడ్డు, ఎల్లమ్మ వీధి, కాపు వీధి, అన్నపూర్ణాశ్రమం వీధుల్లో పర్యటించారు. నిత్యం చెత్త సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, కాలువలు లేక మురుగునీటితో సహవాసం చేయాల్సి వస్తోందని స్థానిక మహిళలు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై బాబూరావు స్పందించి... కమిషనర్ ఇ.శ్రీనివాసులకు ఫోన్‌లో సమస్యను వివరించారు. శాశ్వత పరిష్కారం చూపించాలని కోరారు.

## కాశీబుగ్గ వాసులకు మురుగు కష్టాలు


మరమ్మతులకు గురైన యంత్రం

కాశీబుగ్గ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పలాస-కాశీబుగ్గ మునిసిపాల్టీలో కాలువల్లోని మురుగుతీసే యంత్రం పది రోజులుగా మరమ్మతులకు గురై...మూలకు చేరింది. దీంతో మునిసిపాల్టీలో చెత్త తొలగింపు పనులు నిలిచిపోయాయి. బీ గ్రేడ్ మునిసిపాల్టీగా ఉన్న పలాస-కాశీబుగ్గలో పన్నుల రూపంలో లక్షలాది రూపాయల ఆదాయం వస్తోంది. కానీ ప్రజల మౌలిక వసతులపై దృష్టి పెట్టడం లేదు. ఈ వాహనంతో పాటు యంత్రం పాడవ్వడంతో 31 వార్డుల్లో మురుగు, చెత్త పేరుకుపోయాయి. దీంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఇప్పటికైనా మునిసిపల్ యంత్రాంగం దీనికి మరమ్మతులు చేయించి...పారిశుధ్య సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

## మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి


ర్యాలీలో పాల్గొన్న మహిళా సంఘాల నాయకులు

మందస/హరిపురం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థిక స్వావలంబన, ఆర్థిక సాధికారిత సాధించేందుకు కృషి చేయాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు అన్నారు. సోమవారం మందస, బొడ్డూలురు, నారాయణపురం గ్రామాల్లో మహిళా సంఘాల సభ్యులతో ర్యాలీ చేపట్టారు. గ్రామాల్లో మహిళా స్వయంశక్తి సంఘాలకు లింగ వివక్షకు వ్యతిరేకంగా అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల మహిళా కోఆర్డినేటర్లు మంగమ్మ, మీనాక్షి, ముఖలింగం, వీఏఓలు మోహిని, చంద్రవతి, మహాలక్ష్మి, లోలాక్షి, గ్రామసంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ధర్నాను విజయవంతం చేయండి


పీవోకు వినతిపత్రం అందజేస్తున్న సిబ్బంది

పలాస రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీలకు కనీస వేతనాలు ఇవ్వాలని, అన్ని మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 12న తలపెట్టిన కార్మికుల ధర్నాను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి గణపతి పిలుపునిచ్చారు. పలాస ఐసీడీఎస్ కార్యాలయంలో సోమవారం పీవో పార్వతికి నోటీసును అందజేసి మాట్లాడారు. యాప్‌లన్నీ ఒకే యాప్‌గా మార్చి పనిభారం తగ్గించాలని, నాణ్యమైన సెల్‌ఫోన్లను అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ అధ్యక్షులు సునీత, సభ్యులు డి.సునీత, అప్పలనర్సమ్మ పాల్గొన్నారు.

## విత్తనాల బిల్లును వెనక్కి తీసుకోండి


నినాదాలు చేస్తున్న రైతు సంఘం నాయకులు

వజ్రపుకొత్తూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తెస్తున్న సీడ్స్ -2025 విత్తనాల బిల్లును వెనక్కి తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డిమాండ్ చేసింది. సోమవారం చీపురుపల్లి పంచాయతీ కొండపల్లిలో జిల్లా రైతు సంఘం నాయకులు యంపల్ల కామేశ్వరరావు విలేకరులతో మాట్లాడుతూ విద్యుత్ స్మార్టు మీటర్ల పేరిట ఆదానీ కంపెనీకి లాభాలు తెచ్చిపెట్టే మోసపూరిత చట్టం కూడా రద్దు చేయాలన్నారు. అనంతరం చట్టాల ప్రతులను దహనం చేశారు.

## వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు


రికార్డులు పరిశీలిస్తున్న కృష్ణారావు

పాతపట్నం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్ర మత్తంగా ఉండాలని మండల జీఎస్‌డబ్ల్యూఎస్ అధికారి బి.కృష్ణారావు తెలిపారు. స్థానిక బీఆర్ అంబేద్కర్ గురుకుల బాలికల ఆశ్రమ పాఠశాల, కాగువాడలోని జ్యోతి రావుపూలే గురుకుల బాలికల ఆశ్రమ పాఠశాలను సోమవారం సందర్శించారు. జిల్లా వ్యాప్తంగా వసతి గృహాల విద్యార్థులు సీజనల్ వ్యాధులకు గురవుతున్నారని తెలిపారు. వ్యాధుల నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలపై సిబ్బందికి సలహాలిచ్చారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా... తాగునీరు కలుషితం కాకుండా చూసుకోవాలన్నారు. విద్యార్థులు అనారోగ్యానికి గురైతే తక్షణమే స్పందించాలని ఆయన స్పష్టం చేశారు.

## 100 రోజుల ప్రణాళిక అమలుపై ఆరా


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈవో శాంతారావు

పోలాకి (నరసన్నపేట), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పదో తరగతి విద్యార్థులకు సంబంధించి 100 రోజుల విద్యాప్రణాళిక అమలు తీరును ఎంఈఓ శాంతారావు పరిశీలించారు. బాడాంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సోమవారం ఆయన సందర్శించారు. పదో తరగతి విద్యార్థుల విద్యా ప్రమాణాలు పెంచేందుకు సూచనలిచ్చారు. ఇదిలా ఉండగా.. జలుమూరు ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న విద్యార్థులను తమ సొంత నిధులతో ఆంధ్ర, ఒడిశాలోని వివిధ ప్రాంతాలకు వైజ్ఞానిక, విహార యాత్రలకు తీసుకు వెళుతున్నట్టు ఉపాధ్యాయుడు మెండ రామారావు ప్రకటించినట్టు ఎంఈఓ తెలిపారు. ఆయన వెంట పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సీఆర్‌పీలు ఉన్నారు.

## జ్వరాలపై అప్రమత్తత అవసరం


జ్వరాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

టెక్కలి రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జ్వరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో మేరీకేథరిన్ తెలిపారు. సోమవారం భగవాన్‌పురంలో జ్వరాలు ప్రబలటంతో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఇంటింటికి వెళ్లి పరీక్షలు చేయించారు. వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి గాయత్రి, తదితరులు పాల్గొన్నారు.

## వైద్య శిబిరాలను వినియోగించుకోండి

పలాస రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉచిత వైద్యశిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు అన్నారు. పలాస మండలం గరుడఖండి గ్రామంలో సోమవారం విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం 250 మందికి ఉచితంగా వైద్యపరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యురాలు కూన అరుణకుమారి, టీడీపీ నాయకులు పీరుకట్ల విఠల్‌రావు, యవ్వారి మోహనరావు, కొరికాన శంకరరావు, మాజీ సర్పంచ్ ఎస్.రామారావు, సాసుమాన చంద్రమౌళి, సాసుమాన సంతోష్, బూర్లె కృష్ణంరాజు, పాపారావు పాల్గొన్నారు.

## ఉత్తమ ఫలితాలు సాధించాలి

పాతపట్నం రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు ప్రయత్నించాలని ఎంఈవో తిరుమలరావు తెలిపారు. సోమవారం తెంబూరు, పరియాపల్లి పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులకు వంద రోజుల ప్రణాళికలు కచ్చితంగా అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## టార్పాలిన్ల పంపిణీ

పలాస రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వర్షాలు, గాలుల వల్ల పంటను నష్టపోకుండా ఉండేందుకు కూటమి ప్రభుత్వం రైతులకు టార్పాలిన్ల అందజేస్తోంది. పలాస మండలం బొడ్డపాడు గ్రామంలో రైతులకు సోమవారం వీటిని అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కిక్కర ఢిల్లీరావు, రైతులు పాల్గొన్నారు.

**విద్యార్థులకు దుప్పట్లు..**

కాశీబుగ్గ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అక్కుపల్లి రోడ్డులో ఉన్న బీసీ సంక్షేమ వసతి గృహంలో విద్యార్థులకు నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త డాక్టర్ దుర్గారావు సొంత నిధులతో సోమవారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులను ఆదుకోవడానికి 50 మందికి దుప్పట్లు అందజేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు వంశీకృష్ణ, దేవరాజు, కేదారనాథ్, రామ్ తదితరులు పాల్గొన్నారు.

## బిల్లులు తీసుకోండి

హిరమండలం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రైతులు ప్రైవేటు దుకాణాల్లో ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేసేటప్పుడు కచ్చితంగా సంతకాలు చేసి... బిల్లులు తీసుకోవాలని రణస్థలం వ్యవసాయశాఖ ఏడీ శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండలంలో ఉన్న మూడు ఎరువుల దుకాణాలలో తనిఖీలు నిర్వహించారు. వాటిలోని రికార్డులు పరిశీలించారు. పురుగు మందులు, ఎరువులు అధిక ధరలకు అమ్మితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దుకాణాల వద్ద ధరల పట్టికలను ఉంచాలన్నారు. ఆయనతో పాటు వ్యవసాయ అధికారి సంధ్య ఉన్నారు.

## నాణ్యత లోపిస్తే చర్యలు

పాతపట్నం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎరువుల్లో నాణ్యత లేకపోయినా, అధిక ధరలకు అమ్మినా చట్టపరమైన చర్యలు తప్పవని నరసన్నపేట వ్యవసాయశాఖ ఏడీ లింగాల వేంకట మధు హెచ్చరించారు. పాతపట్నం మండలంలోని కొరసవాడ గంగువాడ, తెంబూరులలోని ఎరువుల షాపులను సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. షాపులలో రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారితో మాట్లాడుతూ నాణ్యమైన ఎరువులను మాత్రమే విక్రయించాలని... అధికారుల సూచనల మేరకే రైతులు ఎరువులు వినియోగించేలా సహకరించాలని తెలిపారు. ఆయన వెంట ఏవో కె.సింహాచలం తదితరులు ఉన్నారు.

**తాగునీటికి రూ.50 వేల విరాళం**

పోలాకి(నరసన్నపేట), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నరసన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థి, ప్రముఖ వైద్యులు బలగ మురళి కళాశాలకు రూ.50 వేలు విరాళంగా అందించారు. విద్యార్థులకు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు ఈ మొత్తాన్ని డాక్టర్ మురళి అందించినట్టు ప్రిన్సిపాల్ ఎం.పవన్‌కుమార్ సోమవారం తెలిపారు. ఆయన వెంట కాళింగ సంక్షేమ సంఘ అధ్యక్షులు ఉప్పాడ పూర్ణారావు, కోశాధికారి సువ్వారి మురళీధరరావు ఉన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ బలగ మురళికి ప్రిన్సిపాల్ కృతజ్ఞతలు తెలిపారు.

## డ్రైనేజీలు శుభ్రం

నందిగాం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నందిగాం సర్వీస్ రహదారిలోని మండల కాంప్లెక్స్‌కు వెళ్లే మార్గాంలో డ్రైనేజీని ఎట్టకేలకు పరిశుభ్రం చేశారు. ఈ డ్రైనేజీలో మురుగు పేరుకుపోవడంతో దుర్వాసనతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. దీనిపై 'ఆంధ్రజ్యోతి'లో కథనాలు వెలువడడంతో అధికారులు స్పందించి పరిశుభ్రం చేశారు.